క్లుప్తంగా

మసీదులకు రూ. లక్ష ఆర్థిక సాయం



పెనమలూరు: రంజాన్ పండుగ సందర్భంగా మసీదుల్లో ప్రార్థనలు చేసే ముస్లింలకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి చాన్‌బాషా గురువారం వివరాలు తెలుపుతూ రంజాన్ పండుగ సందర్భంగా ఉపవాస దీక్ష చేస్తూ మసీదుల్లో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్‌కు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి రూ. లక్ష సాయం అందించారన్నారు. సనత్‌నగర్‌లో ఉన్న ఐదు మసీదులకు రూ. 20 వేల చొప్పున సాయం మసీదు పెద్దలకు అందజేశామని తెలిపారు. ముస్లిం సంప్రదాయాల పట్ల భక్తి, ముస్లింపై ఉన్న ప్రేమతో ఎమ్మెల్యే పార్థసారథి సాయం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ఖాదర్, పఠాన్‌అహ్మద్, అజీజుల్లాఖాన్, రెహమాన్, లతీఫ్, సిద్ధిఖ్, వాహెబ్, సైదు అహ్మద్, హమీద్ పలువురు పాల్గొన్నారు.

పథకాల అమలులో పారదర్శకత



ఉయ్యూరు: పథకాల అమలులో పారదర్శకత పాటించి ప్రజలకు సమర్థంగా సేవలు అందించాలని ఎంపీడీఓ విమాదేవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని అన్ని సచివాలయాల కార్యదర్శులు, సిబ్బందికి గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పథకాల అమలు, సచివాలయం ద్వారా అందుతున్న సేవలు అర్హుల జాబితా గ్రామాల్లో సమస్యలపై సమీక్ష చేశారు. సచివాలయాల ద్వారా ప్రజలకు సమర్థంగా సేవలు అందించి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని సూచించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ పీవీఎస్ మైథిలి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పలూరు పీఏసీఎస్‌కు కమిటీ నియామకం

కంకిపాడు: ఉప్పలూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి త్రీమెన్ కమిటీని నియమిస్తూ వ్యవసాయ, సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు తాజాగా సొసైటీ కార్యాలయానికి చేరాయి. సొసైటీ నూతన చైర్‌పర్సన్‌గా గ్రామ మాజీ సర్పంచ్ మాగంటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. సభ్యులుగా లాం శామ్యూల్, బడుగు కోటయ్య నియమితులయ్యారు. త్వరలో ఈ ముగ్గురు ప్రతినిధులతో కూడిన పాలకవర్గం ప్రమాణస్వీకారం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కంకిపాడు: తాగునీటి సమస్య పరిష్కారానికి సమర్థంగా చర్యలు తీసుకుంటున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. కంకిపాడు పాలకవర్గ ప్రతినిధులతో కలిసి పట్టణంలో చేపట్టిన పైపులైను విస్తరణ పనులను ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవితో కలిసి గురువారం పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్బారావు పని వివరాలను తెలియజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు మాట్లాడుతూ వేసవి రీత్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ ప్రత్యేక శ్రద్ధ వహించిందన్నారు. సురక్షిత తాగునీటిని ప్రజలకు అందించాలని సూచించారు. పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నీటి ఇబ్బందులు రాకుండా చూడాలని స్పష్టం చేశారు.

అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన



హనుమాన్‌జంక్షన్ రూరల్: అగ్నిప్రమాదాల నియంత్రణపై విద్యార్థులు అవగాహన కల్పించుకోవాలని హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ జి.ఆర్.మోహనరావు సూచించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అగ్నిప్రమాపక వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు.

ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలి

ఉంగుటూరు: మండలంలో ఇంకా ధాన్యం విక్రయించాల్సిన రైతులు ఉంటే రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ హరీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. వలంటీర్లు తమకు కేటాయించిన కుటుంబాల్లో ధాన్యం విక్రయించాల్సిన రైతులు ఉంటే ఆర్బీకేలో సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



పూర్తి చేసిన ప్రజా మద్దతు పుస్తకాలను అందజేస్తున్న సచివాలయాల కన్వీనర్లు



వీరవల్లిలో ప్రజలతో కలిసి స్టిక్కర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కంకిపాడు: సంక్షేమ పాలన అందించే విషయంలో సీఎం జగన్ దేశానికే స్ఫూర్తిగా నిలుస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. బాకీ బాబు మాట్లాడుతూ ప్రజల అభ్యున్నతి, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అన్ని వర్గాల సంతృప్తికరస్థాయి పెంచే లక్ష్యంతో సీఎం జగన్ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు చేసే విష పూరిత కుట్రలు, నీచరాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జగనన్న సచివాలయాల మండల చైర్మన్ రాచూరి చిరంజీవి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. మండలంలోని మంతెన గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరంకి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు బండి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్నే మా నమ్మకం..

పెనమలూరు: జగనన్న పాలనలో అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, తిరిగి జగనన్నే సీఎం కావాలని బీసీ సంఘ కార్యదర్శి, వైఎస్సార్ సీపీ నాయకుడు కోసూరి నరేష్‌కుమార్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు యనమలకుదురు ఇందిరానగర్ జెండా చెట్టు క్లస్టర్ 22 ప్రాంతంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆదేశాలతో, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సూచనలతో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు, ప్రజల సమస్యలు తెలుసుకున్నామన్నారు. ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వానికి ప్రజల మద్దతు..

రామవరప్పాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన ప్రజల నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి విశేష మద్దతు లభిస్తోందని విజయవాడ రూరల్ మండల జెడ్పీటీసీ సభ్యుడు కాకర్లమూడి సువర్ణరాజు అన్నారు. ప్రసాదంపాడు సచివాలయం-3 పరిధిలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో భాగంగా ప్రజల అభిప్రాయం తెలుసుకునే కార్యక్రమాన్ని గురువారం పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రజా మద్దతు పుస్తకాలను సచివాలయం కన్వీనర్లు చెన్ను అవినాష్, కలపాల అజయ్, పిల్లజెట్టి అనుపమలు మండల సచివాలయం కన్వీనర్ సాదం వెంకటేశ్వరరావుకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, చెన్ను కమల్‌రాజ్, ఎంపీటీసీ దూరు రత్నం, వార్డు సభ్యులు పిల్లజెట్టి కరుణాకర్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, రాచూరి చిరంజీవి ఇతర నేతలు

సంక్షేమ సారథి జగనన్నే..

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో గురువారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. బీబీగూడెంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి సామల ఆంజనేయులు, సహకార బ్యాంకు అధ్యక్షుడు బోయపాటి మురళీకృష్ణ, గ్రామ కన్వీనర్ తమ్మిశెట్టి రఘుబాబు, మాజీ సర్పంచ్ బోయపాటి బసవపూర్ణయ్య, ఎంపీటీసీ సభ్యురాలు మోరం నాగరాణి, ఉపసర్పంచ్ కాట్రు ధర్మారావు ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. కొత్తగూడెంలో ఎంపీటీసీ సభ్యురాలు చిలకపాటి దుర్గ ఆధ్వర్యంలో, గొల్లనపల్లిలో సచివాలయం కన్వీనర్ పలగాని శోభనాద్రి, కట్టుబడిపాలెంలో సచివాలయ కన్వీనర్‌లు, గృహసారథులు, ముస్తాబాదలో మాజీ సర్పంచ్ కైలే ఆదిలక్ష్మి, వీరపనేనిగూడెంలో బొమ్మారెడ్డి హరీష్‌రెడ్డి, నందిపాటి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది.



బీబీగూడెం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



యనమలకుదురులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తున్న కోసూరి నరేష్‌కుమర్

వీరవల్లిలో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో పాటుగా గ్రామ సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు గ్రామంలోని ఇంటింటికి వెళ్లి గత టీడీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని తెలియజేశారు. ప్రతి ఇంటికి 'మా నమ్మకం నువ్వే జగనన్న' నినాదం ఉన్న స్టిక్కర్లను వారి అనుమతితో తలుపులు, గేట్లకు అంటించారు. గన్నవరం ఏఎంసీ మాజీ డైరెక్టర్ కోడెబోయిన బాబి, వైఎస్సార్ సీపీ నాయకులు గూడవల్లి సుధాకర్, ఆత్మూరి బాలాజీ, తోమ్మంద్రు రమేష్, పిల్లా నాగరాజు, కోటా సురేష్ పాల్గొన్నారు.

జీవితాల్లో వెలుగు నింపిన జగనన్న



పోరంకిలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత తమ జీవితాల్లో వెలుగు నిండిందని లబ్ధిదారులు పి. వెంకటరసమ్మ, రమణయ్య అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సచివాలయం-5 పరిధిలో పద్మనాభపురం, శివసదన్ ప్రాంతాల్లో పర్యటించి లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల బుక్లెట్‌లు అందజేసి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. లబ్ధిదారులు మాట్లాడుతూ జగనన్న అధికారం చేపట్టిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్ పింఛన్, వైఎస్సార్ రైతుభరోసా, అమ్మ ఒడి, పేదలందరికీ ఇంటి స్థలాలు ఇలా అనేక పథకాలు అవినీతి రహితంగా అమలు చేస్తున్నారన్నారు. మరలా జగనన్నే అధికారంలోకి రావాలని తామంతా జగనన్నకు అండగా నిలుస్తామని తెలిపారు. స్థానికంగా రోడ్ల నిర్మాణం చేయాలని, డ్రైనేజీలు నిర్మించాలని, తాగు నీటి సమస్య పరిష్కారం చేయాలని కోరారు.

ప్రజల జీవితాల్లో మార్పు..

జగనన్న సీఎం అయిన తర్వాత ప్రజల జీవితాల్లో మార్పు వచ్చిందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. సంక్షేమ పథకాలతో ఆర్థిక సాయం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. టీడీపీ పాలనలో పోరంకి గ్రామానికి జరిగిన న్యాయం ఏమీలేదన్నారు. ప్రభుత్వం అండదండలతో తాను గ్రామంలో అనేక రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేయించానని తెలిపారు. గ్రామంలో అందరికీ కృష్ణా జలాలు అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాడిగడప కమిషనర్ ఎన్.ప్రకాశరావు, టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, కంకిపాడు జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, నేతలు నల్లమోతు జీవన్, అద్దేపల్లి చందు, అంకెం రాజేష్, బందెల రాజు, బొర్రా వెంకటరమణయ్య, చుండూరు శేఖర్, గట్టు శ్రీనివాసరావు, ఆకునూరు సుబ్బారావు, అంగిరేకుల సీతారామయ్య, వేమూరి బాలకృష్ణ, చాగంటిపాటి శివరామకృష్ణ, ఈదా రాజేష్ పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి 'మానవత' సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: వెన్నుపూస సమస్యతో బాధపడుతున్న ఎనిమిదేళ్ల చిన్నారికి శస్త్రచికిత్స నిమిత్తం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గురువారం రూ.45 వేల ఆర్థిక సాయం చేసింది. ఏలూరు జిల్లా ఆగిరిపల్లికి చెందిన ఎం.రమేష్ కుమార్తె అంకిత నాలుగో తరగతి చదువుతోంది. వెన్నుపూస సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆ చిన్నారికి తక్షణమే ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. ఆర్థికస్తోమత లేని రమేష్ కుటుంబ సభ్యులు మానవత హనుమాన్‌జంక్షన్ శాఖను ఆశ్రయించారు. మానవత సభ్యులు రూ.45 వేలు ఆర్థిక సాయం చేశారు. మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు చక్కా సుబ్బారావు, సభ్యులు కె.వి.సుబ్బారావు, గూడపాటి జయరామచంద్రరావు, గంటా సత్యనారాయణ, డాక్టర్ నిడమర్తి లలితా కామేశ్వరి, పొట్లూరి శేషాచలం, వడ్డి రాజేశ్వరరావు, నారగాని కొండలరావు పాల్గొన్నారు.



చిన్నారి కటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న మానవత సభ్యులు

అర్హులందరికీ సంక్షేమం అందాలి

పెనమలూరు: సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు జరిగే విధంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధులు సక్రమంగా నిర్వర్తించాలని పెనమలూరు గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు అన్నారు. పెనమలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్పంచి అధ్యక్షతన ఆయుష్మాన్ భారత్ సర్వే, గృహాలు, ఈకేవైసీ తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి లింగాల భాస్కరరావు మాట్లాడుతూ వలంటీర్లు విధులు నిర్లక్ష్యం చేయరాదన్నారు. బాధ్యతగా పని చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సూచించారు. మండల పరిషత్ అధికారుల బృందం అన్ని అంశాలపై సమీక్ష చేసి సిబ్బందితో మాట్లాడారు. ప్రతి సమాచారాన్ని ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతాశర్మ, ఏవో లోయ శివశంకర్‌రావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ రాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచి లింగాల భాస్కరరావు

పార్ట్‌టైమ్ జాబ్ పేరిట టోకరా

పెనమలూరు: కానూరులో ఇంజినీరింగ్ విద్యార్థి ఆన్‌లైన్ మోసానికి గురవ్వటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం కానూరు అమరావతినగర్‌కు చెందిన కొసరాజు సాకేత్ కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అతను పార్ట్‌టైమ్ ఉద్యోగం కోసం అన్వేషిస్తున్నాడు. అయితే ఈ నెల 19వ తేదీన అతను గూగుల్‌లో వెతుకుతుండగా అతనికి 5షాప్ డాట్ ఇన్ అనే వెబ్‌సైట్ కనిపించటంతో దానిని క్లిక్ చేశాడు. డిజిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్ ఉద్యోగాలున్నాయని అతనికి సమాధానం వచ్చింది. ప్రోడక్ట్ అమ్మితే అందులో లాభం ఇస్తామని తెలిపారు. దీంతో అతను రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో ఇచ్చిన లింక్‌ను క్లిక్ చేసి వివరాలు నమోదు చేశాడు. ఆ తర్వాత అతను రూ. 100 పెట్టి ప్రోడక్ట్ కొంటే వెంటనే రూ. 200 లాభం ఇచ్చారు. అనంతరం విడతల వారీగా సొమ్మును పెట్టుబడి పెట్టాడు. కొంత సమయం అయిన తర్వాత డబ్బులు వెనక్కి రావడం లేదు. దీంతో ఈ వ్యవహారంపై సాకేత్‌కు అనుమానం వచ్చి ప్రోడక్ట్ కోసం పెట్టుబడిగా పలు దఫాలుగా చెల్లించిన రూ. 16,724 సొమ్ము తిరిగి విత్‌డ్రాకు యత్నించాడు. కానీ అవి విత్ డ్రా కాలేదు. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

పీపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఉంగుటూరు: ప్రతి ఒక్కరూ క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని గన్నవరం మేధ టవర్స్‌లోని ఇన్‌ఫ్లోక్యూరిస్ ఎండీ మోహన్‌కుమార్ సూచించారు. పెద అవుటపల్లి ప్రీమియర్ లీగ్ (పీపీఎల్) సీజన్-3ని గ్రామ పెద్దలతో కలసి మోహన్‌కుమార్ గురువారం ప్రారంభించారు. మూడురోజులపాటు జరిగే పీపీఎల్‌లో ఐదు టీమ్‌లు పాల్గొంటాయని నిర్వాహకుడు పడమట నాని తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.25 వేలు అందజేస్తామన్నారు. కొండేటి వెంకటేశ్వరరావు, పడమట శ్రీరామరాజు, పరసా కిరణ్ పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న మోహన్‌కుమార్

శ్మశానవాటిక అభివృద్ధి పనులపై విచారణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు హిందూ శ్మశానవాటిక అభివృద్ధి నిమిత్తం దాతల నుంచి విరాళాలు సేకరించి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై గుడివాడ డివిజనల్ పంచాయతీ అధికారి సంపత్‌కుమారి గురువారం విచారణ చేపట్టారు. పంచాయతీ గత పాలకవర్గం హయాంలో చేపట్టిన శ్మశానవాటిక అభివృద్ధి పనులు, ప్రధాన ద్వారంపై సర్పంచ్ కాకాని అరుణ, ఉప సర్పంచ్ కాకాని వెంకటేశ్వరరావు (బాబు) తమ పేర్లు ఏర్పాటు చేయటంతో గ్రామానికి చెందిన వేగుంట వెంకట రామారావు ఇటీవల డీపీఓకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డీపీఓ ఆదేశాల మేరకు ఈ వ్యవహారంపై గుడివాడ డీఎల్‌పీఓ సంపత్‌కుమారి స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. మాజీ ఉప సర్పంచ్ కాకాని వెంకటేశ్వరరావు, ఫిర్యాది వెంకట రామారావును విడివిడిగా విచారించి, వారి నుంచి వివరాలను సేకరించి, వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. ప్రస్తుత సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ వాంగూల్మాలను కూడా నమోదు చేశారు.

డీఎల్‌పీఓకు ఆర్జీ

శ్మశానవాటికపై విచారణ చేపట్టేందుకు వచ్చిన డీఎల్‌డీఓను హనుమాన్‌నగర్ చెందిన వార్డు సభ్యుడు తాడిశెట్టి శ్రీను ఆధ్వర్యంలో పలువురు కలిసి ఆర్జీ అందజేశారు. చిన్నాల నర్సయ్య విగ్రహం నుంచి కాసులు నివాసం వరకు నిర్మించిన సీసీ రోడ్డుకు రెండు వైపులా మార్జిన్లు లేకపోవటంతో ఈ మార్గంలో వాహనాలపై ప్రయాణం ప్రమాదభరితంగా మారిందని వివరించారు. గ్రావెల్‌తో మార్జిన్లు ఏర్పాటు చేయాలని కోరారు.

హైస్కూల్ క్రీడా ప్రాంగణం అభివృద్ధికి కృషి

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం అభివృద్ధికి కృషి చేస్తానని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి పేర్కొన్నారు. క్రీడా ప్రాంగణంలో దాత పెద్దు శ్రీకాంత్ సహకారంతో పోలీస్ ఫిజికల్ పరీక్షలకు శిక్షణ పొందుతున్న అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన పిట్‌ను ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎస్‌ఐ, కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల లాంగ్ జంప్ శిక్షణ నిమిత్తం పిట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. క్రీడా ప్రాంగణంలో ప్రహరీ మరమ్మతులకు అవసరమైన నిధులు మంజూరుకు కృషిచేస్తానన్నారు. తొలుత రంజాన్ మాసం సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈద్ ఉల్ ఫితర్ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మడుపల్లి బాలకృష్ణమూర్తి, వీసం ప్రసాదరావు, కోశాధికారి గంపా సాంబశివరావు, వ్యవస్థాపక అధ్యక్ష, కార్యదర్శులు ముక్కామల సుబ్బారావు, టీ.ఎస్.ఆర్.కె.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పిట్‌ను ప్రారంభిస్తున్న ఎలిజబెత్‌రాణి తదితరులు

నలుగురు జూదరుల అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం ఆరుగొలనులో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు గురువారం దాడి చేశారు. ఎస్‌ఐ ఎ.డి.ఎల్.జనార్దన్ నేతృత్వంలో జరిగిన ఈ దాడిలో నలుగురు జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద రూ.51,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రోజువారీ లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

- ఆ దిశగా చర్యలు చేపట్టండి
- టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): జగనన్న ఇళ్లకు సంబంధించి అధికారులు రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. ఆయన చాంబర్ నుంచి గురువారం జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా, మండలాధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పునాది, ఆపై స్థాయిలో ఉన్న గృహాల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. రోజుకు 945 గృహాలను దశలవారీగా పూర్తి చేసేలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. జిల్లాలో గన్నవరం, ఉంగుటూరు, ఉయ్యూరు, చల్లపల్లి మండలాల్లో పురోగతిలో చాలా వెనుకబడి ఉన్నాయన్నారు. ఆ ప్రాంతాల్లో ఆర్డీవోలు క్షేత్ర పర్యటనలు చేసి వాస్తవ విషయాలు తెలుసుకుని పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహాల నిర్మాణానికి అవసరమైన సిమెంటు, ఇనుము, ఇసుక తదితర సామగ్రి సిద్ధం చేసుకోవడంతో పాటు బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించేలా తోడ్పడాలన్నారు. జిల్లాలో రీ-సర్వే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టాలన్నారు. జిల్లాలోని సర్వేయర్లు అందర్నీ ఈ కార్యక్రమానికి వినియోగించుకుని వేగవంతంగా రీ-సర్వే పనులను పూర్తి చేయాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 6 గంటలకే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమంలో పరిష్కరించిన ప్రజల అర్జీలు సంతృప్తికరంగా ఉన్నాయో లేదో గమనించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఒకవేళ ఏదైనా అసంతృప్తి ఉంటే సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కారం చూపాలన్నారు. పరిష్కరించిన అర్జీలు మళ్లీ వస్తుంటే జిల్లా అధికారులు వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రాజాబాబు. చిత్రంలో జేసీ అపరాజితసింగ్, అధికారులు

రీ-సర్వే పనులు వేగవంతం చేయండి.

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలైన గృహ నిర్మాణం, రీ-సర్వే తదితర అంశాలకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహనిర్మాణం, రీ-సర్వే, జాతీయ రహదారుల ప్రాజెక్టులకు భూ సేకరణ, స్పందన, వ్యవసాయం, భూ సమస్యల పరిష్కారం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌తో కలిసి జిల్లా పురోగతిని ఆయనకు వివరించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రీ-సర్వే ప్రగతికి సంబంధించి ఇప్పటి వరకు 109 గ్రామాల్లో పూర్తి చేసి 13వ నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. వెబ్‌ల్యాండ్ 2.0లో 97 గ్రామాల రీ-సర్వే డేటాను అప్‌లోడ్ చేశామని, 31,463 మందికి భూ హక్కు పత్రాలు ఇచ్చామన్నారు. జిల్లాలోని అన్ని లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించి నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి సంబంధించి హంసలదీవి వద్ద బీచ్, రిసార్ట్స్ ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించాలని అధికారులకు సూచించారు. మంగినపూడి బీచ్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. డీఆర్వో ఎం వెంకటేశ్వర్లు, కేఆర్‌ఆర్‌సీ డెప్యూటీ కలెక్టర్ బి. శివనారాయణరెడ్డి, ట్రైనీ డెప్యూటీ కలెక్టర్ చైతన్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.